**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం : 9502535152, 7416812467

శనివారం 13.07.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -155 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00

## రఘురామ రిటర్న్ గిఫ్ట్

### మాజీ సీఎం జగన్, ఐపీఎస్ అధికారి సునీల్ పై కేసు



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ )** తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు రఘురామకృష్ణ రాజు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రిటర్న్ గిఫ్ట్ గట్టిగానే ఇవ్వబోతున్నారు. రఘురామకృష్ణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కేసు నమోదైంది. గుంటూరులోని నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ ప్రోత్సాహంతో అప్పటి సీబీఐ డీజీ పీవీ సునీల్‌కుమార్, కొందరు అధికారులు తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని, కస్టడిలో తీవ్రమైన భౌతిక హింసకు పాల్పడ్డారని రఘురామకృష్ణ రాజు పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ కేసు నమోదు చేశారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద తనను అరెస్టు చేసి అంతమొందించేందుకు తీవ్రంగా హింసించారని టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు తెలిపారు. అక్రమ కేసులు బనాయించి తనను కస్టడీలోకి తీసుకోవడమే కాకుండా.. హత్యాయత్నం చేశారని గుంటూరు జిల్లా ఎస్పీకి రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు అప్పటి సిఐడి చీఫ్ ఏ1గా సునీల్‌కుమార్, ఏ2గా ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఏ3గా వైఎస్ జగన్, ఏ 4గా అప్పటి సీబీఐ ఏఎస్పీ విజయ్‌పాల్, ఏ 5గా జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు తదితర అంశాలకు సంబంధించి పలు సెక్షన్ల కింద కేసు పెట్టారు. వీటిలో నాన్‌బెయిలబుల్ సెక్షన్లుకూడా ఉన్నట్లు సమాచారం.

## ఇక రహదారులకు మోక్షం

- తక్షణమే రోడ్ల మరమత్తులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- వైసీపీ ప్రభుత్వం కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేదు...కాంట్రాక్టర్లకు బిల్లులూ ఇవ్వలేదు
- గత ప్రభుత్వ తీరుతో కాంట్రాక్టర్లూ ముందుకు రావడం లేదు
- గుంతలు పూడ్చేందుకు తక్షణం రూ.300 కోట్లు అవసరం
- ఆర్ అండ్ బి సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు
- అత్యవసర పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశం
- రోడ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీపై అధికారులు, ఐఐటి ప్రొఫెసర్లతో ముఖ్యమంత్రి సమీక్ష



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** : రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై సీఎం నారా చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. గత ప్రభుత్వం రోడ్ల స్థితిగతులను పట్టించుకోలేదని, దీంతో వాహనదారులు, ప్రజలు ఐదేళ్లపాటు నరకం చూశారని సీఎం అన్నారు. ఈ పరిస్థితిని మార్చే పనులు మొదలు కావాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే ప్రక్రియ మొదలు పెట్టాలని ఆదేశించారు. సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రోడ్ల దుస్థితి, నిధుల అవసరం, ప్రస్తుతం ఉన్న సమస్యలపై సీఎంకు అధికారులు వివరించారు. నాడు రోడ్ల మరమ్మతులపై కనీస మొత్తంలో కూడా నిధులు ఖర్చు చేయలేదని సీఎంకు అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదన్నారు. దీంతో కాంట్రాక్టర్లు కూడా నేడు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని అన్నారు. రాష్ట్రంలో 4,151 కిలోమీటర్ల మేర రోడ్లపై పాత్ హోల్స్ (గుంతలు) సమస్య ఉందని అధికారులు వివరించారు. తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రోడ్లు మరో 2,936 కిలోమీటర్లు మేర ఉన్నాయని సిఎంకు తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో 7,087 కిలోమీటర్ల పరిధిలో తక్షణం పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికారులు వివరించారు. వీటి కోసం కనీసం రూ. 300 కోట్ల నిధులు అవసరం అని తెలిపారు. పాత్ హోల్స్ పూడ్చే పనులు వెంటనే చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. అత్యంవసరంగా బాగు చేయాల్సిన రోడ్లపైనా దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. వెంటనే టెండర్లు పిలిచి

2 లో

## అంతర్జాతీయ వేదికగా ఆంధ్రప్రదేశ్ సేద్యానికి అరుదైన గుర్తింపు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** అంతర్జాతీయ వేదికగా ఆంధ్రప్రదేశ్ సేద్యానికి అరుదైన గుర్తింపు లభించింది. ఈ ఏడాదికి గానూ ప్రతిష్ఠాత్మక 'గుల్బెంకియన్ అవార్డు ' ఏపీ సమాఖ్య ప్రకృతి వ్యవసాయానికి వరించింది. ఒక శాస్త్రవేత్త, మరో సంస్థతో కలిసి ఏపీసీఎన్ఎఫ్ ఈ పురస్కారాన్ని దక్కించుకుంది.

పోర్చుగల్లోని లిస్బన్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయ్కుమార్, మహిళా రైతు నాగేంద్రమ్మ నెట్టం ఈ పురస్కారాన్ని అందుకున్నారు. భారత సంతతి అమెరికన్ శాస్త్రవేత్త రతన్లాల్, ఈజిప్టుకు చెందిన సెకెమ్ స్వచ్ఛందసంస్థకూ అవార్డు లభించింది. ఈ పురస్కారం కింద ఇచ్చే ఒక మిలియన్ యూరోల నగదు బహుమతిని ముగ్గురు విజేతలకు సమానంగా పంచనున్నారు. 117 దేశాల నుంచి వచ్చిన 181 నామినేషన్లతో పోటీపడి ఏపీసీఎన్ఎఫ్ ఈ అవార్డు దక్కించుకుంది.

## కాన్వాయ్ ఆపి వినతులు స్వీకరించిన సీఎం చంద్రబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్ ఆపి సామాన్య ప్రజలను కలిశారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి సచివాలయానికి వెళుతున్న సమయంలో కరకట్టపై ఉన్న ప్రజలను చూసి తన కాన్వాయ్ ను ఆపారు. సమస్యలపై వినతులు అందించేందుకు వచ్చిన ప్రజలను పిలిచి మాట్లాడారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు తమ సమస్యలు చెప్పుకున్నారు. అనంతరం వారి నుండి వినతిపత్రాలు తీసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తానని సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా కారు దిగి వచ్చి హామీ ఇవ్వడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

## వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం పొడిగింపునకు ఆమోదం

### వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** : వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం పొడిగింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి సమాచార శాఖ ప్రతిపాదనలు పంపించిందని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పంపిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోద ముద్ర వేశారని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీం ద్వారా 11,200 మంది జర్నలిస్టులకూ, 34 వేల మంది కుటుంబ సభ్యులకూ లబ్ధి చేకూరనుందని, జర్నలిస్టు కుటుంబాల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.

## అబద్ధాలు, అసత్యాలకు వైఎస్సార్‌సీపీ పార్టీ బ్రాండ్ అంబాసిడర్

వివరాలు 2 లో

## 'తల్లికి వందనం' పథకంపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

వివరాలు 2 లో

## ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు.. మంత్రి టి.జి భరత్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** : ఆంధ్రప్రదేశ్‌కు సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. రాష్ట్రానికి పెట్టబడులు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. విశాఖపట్నంలోని నోవోటెల్ హోటల్‌లో ఆయన పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రముఖులు, సీఐఐ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరినట్లు మంత్రి తెలిపారు.

2 లో

## వ్యర్థాలతో సంపద సృష్టిని శాస్త్రీయంగా చేపట్టాలి

- ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి
- మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఆసక్తి ఉన్నవారికి శిక్షణ
- ఏడాదికి రూ.2643 కోట్లు సంపాదన... 2.45 లక్షల మందికి ఉపాధి
- మార్పు ఎక్కడో ఒక చోట మొదలవ్వాలి . . .నా ఆఫీసు, క్యాంపు కార్యాలయం, నా నియోజకవర్గం నుంచే మొదలుపెడదాం
- పంచాయతీలను గత పాలకులు నిర్వీర్యం చేశారు
- స్వయం సమృద్ధిగా ఎదిగేలా పంచాయతీలను తీర్చిదిద్దుతాం
- పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయంలో వ్యర్థాల నిర్వహణపై ప్రదర్శన పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

2లో




**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ )** 'పనికిరాదని పడేసే చెత్తతో కోట్ల రూపాయల సంపద సృష్టించవచ్చని, లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చ'ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఘన వ్యర్థాలను 12 గంటల్లోపు సేకరించగలిగితే సంపద వస్తుంది... వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలి అన్నారు. ఒక్క గ్రామీణ ప్రాంతాల్లోనే ఏడాదికి రూ. 2643 కోట్ల సంపద సృష్టించడంతోపాటు 2.42 లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చని చెప్పారు. వస్తువులు వినియోగించడం, విసిరేయడం తప్ప క్లీనింగ్ తో సంబంధం లేదనే భావన మనందరిలో ఉందని, ఆ భావన మార్చకపోతే భవిష్యత్తు తరాలకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అనుసరించాల్సిన విధానాలు, వాటి నుంచి ఎటువంటి ఉత్పత్తులు సాధించవచ్చు అనే అంశాలపై సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్మెంట్ (ఎస్.ఎల్.ఆర్.ఎం.) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో గార్బేజ్ టూ గోల్డ్ పేరుతో శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కన్నబాబు, ఎస్.ఎల్.ఆర్.ఎం. ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "మన దైనందిక జీవితంలో చెత్త ఒక భాగమైపోయింది. దానిని మన జీవితాల నుంచి వేరు చేయలేం. ఇలాంటి ప్రదర్శనలు కొత్తేమీ కాదు. ప్రతి ప్రభుత్వం ఎంతో కొంత ప్రయత్నం చేసి ఉంటాయి. మా ప్రభుత్వం హయాంలో మాత్రం బలంగా దీనిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాం.

**పైలెట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో ప్రారంభిస్తాం**

మన దేశం సంస్కృతి, సంప్రదాయాలకు విలువిచ్చే

## నేతన్నలకు సబ్సిడిపై ముడి సరుకు, పనిముట్లు

### చేనేత జౌళి శాఖ మంత్రి సవిత



**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ )** : చేనేత కార్మికులకు మంత్రి సవిత గుడ్ న్యూస్ చెప్పారు. నేతన్నలకు సబ్సిడిపై ముడి సరుకు పనిముట్లు ఇస్తామని తెలిపారు. సొసైటీలు ఏర్పాటు చేసి చేనేత కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. జగన్ సీఎం అయ్యాక నేతన్నలకు మరణ శాసనం రాశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఆప్కో, చేనేతలో భారీగా కుంభకోణాలు జరిగాయని.. వాటన్నింటిపై విచారణ జరిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆప్కో, చేనేత కార్మికులను స్వలాభం కోసం వైసీపీ నాశనం చేసిందని ఫైర్ అయ్యారు. జగన్ తీరుతో చేనేత కార్మికులు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారని.. ఏపీలో వైసీపీ చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. నేతన్న పేరుతో కేవలం వైసీపీ కార్యకర్తలకే నేతన్న హస్తం ఇచ్చారని ఆమె మండిపడ్డారు. ఆప్కో, చేనేత రంగాల్లోని అవినీతిని ఒక్కొక్కటిగా వెలికి తీస్తామని తేల్చి చెప్పారు. వైసీపీ హయంలో గత 5 సంవత్సరాలుగా ఆప్కో, చేనేతలో జరిగిన కుంభకోణంపై విచారణ చేపడుతామని తెలిపారు. ఆప్కో చేనేత కార్మికులను స్వలాభం కోసం నాశనం చేశారన్నారు.

ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు చేనేత కార్మికులు వలస వెళ్తున్నారన్నారు. చేనేత రంగాన్ని రాష్ట్రంలో నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. జరిగిన అన్నింటిపైనా విచారణ జరిపిస్తామన్నారు. నేతన్న నేస్తం పేరుతో వైసీపీ కార్యకర్తలకు నేతన్న నేస్తం ఇచ్చారన్నారు. సబ్సిడీపై ముడిసరుకు పనిముట్లు ఇస్తున్నామన్నారు. సొసైటీలను ఏర్పాటు చేసి చేనేత కార్మికులను ఆదుకుంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలకు పెద్ద పీటవేశారన్నారని వ్యాఖ్యలు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అర్హులైన ప్రతి చేనేత కార్మికుడిని ఆదుకుంటామని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

## సివేరి సోమ కుమారుడి చదువు బాధ్యత నాదే: సీఎం చంద్రబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** నక్సల్స్ చేతిలో హతమైన అరకు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సోమ భార్య ఇచ్చావతి యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సోమ కుమారుడి చదువు బాధ్యతను తాను తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

అంతకుముందు సీఎం సచివాలయానికి వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సమస్యలతో వచ్చిన వారిని చూసి రోడ్డుపైనే కాన్వాయ్ ఆపారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. వైకాపా గూండాల దాడిలో సర్వస్వం కోల్పోయానని.. ఆదుకోవాలని సీఎంను అరకు సర్పంచ్ శ్రీనివాస్ కోరారు. సమస్యను పరిష్కరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## ఉత్తరాంధ్రపై చంద్రబాబుది సవతి తల్లి ప్రేమ..



**● వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలు**

**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ )** ఉత్తరాంధ్రపై సీఎం చంద్రబాబు నాయుడిది సవతి తల్లి ప్రేమ అని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. సీఎంగా ఆయన ఏం పనిచేస్తారో చెప్పకుండా.. ఎంతసేపు వైసీపీని నిందించడానికే పరిమితమయ్యారని మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం పనులు శరవేగంగా జరగడానికి తాము ఎంతో కృషి చేశామని చెప్పారు. రైతులను ఒప్పించి భూసేకరణ చేశామని అన్నారు. వైసీపీ చేసిన ప్రగతిని.. కూటమి అకౌంట్‌లో వేసుకోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఉన్న మార్కెటింగ్ స్కిల్స్ ప్రపంచంలో మరే రాజకీయ నాయకుడికి ఉండవంటూ ఎద్దేవా చేశారు.

విశాఖను ఆర్థిక రాజధాని చేస్తామని అంటున్న మాటలను తన చిన్నప్పటి నుంచి వింటున్నా అని గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. అది ఆచరణలో ఎక్కడా లేదని అన్నారు. ప్రజలకు మంచి జరగాలన్నదే తమ ఆశయమని చెప్పారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేవరకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వ ఉడత బెదిరింపులకు భయపడేది లేదని గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. వైసీపీపై ఎన్నికుట్రలు చేసినా భయపడేది లేదన్నారు. ప్రజలకు మంచి చేయాలనే కోరిక ఉండాలి.. కానీ ఇలా ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేశారని తెలిపారు.

## 9 నెలల్లోనే అంతర్జాతీయ టెర్మినల్స్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం : ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎయిర్ పోర్ట్ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్ట్ అంతర్జాతీయ టెర్మినల్ పనులు గత ప్రభుత్వం హయాంలో అటకెక్కాయి.. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్ టెర్మినల్ అభివఅద్ధి పనులను సంవత్సరంలోపు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు.

ఇక, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్టు అభివృద్ధికి కృషి చేసి రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయిలో నిలుపుతామన్నారు. విమానాశ్రయం అభివృద్ధికి అను విధాలుగా కఅషి చేస్తాను అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనులను ఎయిర్ పోర్టుల్లో సందర్శించి సమీక్షించారు.. పనుల్లో జాప్యం ఉంటే కాంట్రాక్టర్లను మార్చాలి.. అంతేగాని గత వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు ఎయిర్ పోర్ట్ పనులు నిలిపి వేసి చోద్యం చూశారు అని కేంద్రమంత్రి మండిపడ్డారు. మా ఎన్డీయే ప్రభుత్వంలో కేవలం 9 నెలలోనే ఎయిర్ పోర్ట్ ను అంతర్జాతీయ టెర్మినల్స్ ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఎయిర్ పోర్టులో అంతర్జాతీయ టెర్మినల్ పనులు సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## కడప స్టీల్ ప్లాంట్ కోసం కృషి చేస్తా: ఎంపీ సీఎం రమేష్



**కడప ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కడప స్టీల్ ప్లాంట్ పై చంద్రబాబుతో చర్చించాం.. యుద్ధ ప్రాతిపదికన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తాననిఎంపీ సీఎం రమేష్ నాయుడు తెలిపారు. కడప జిల్లాలోని అమీన్ పీర్ దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అనకాపల్లి ఎంపీగా గెలిచిన కడప జిల్లా సమస్యలు పరిష్కరిస్తా.. నేను ఎక్కడ ఉన్నా జిల్లా వాసుల సహకారం అందించారు.. కడప జిల్లా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాను అని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవినీతిపై విచారణ చేపడతాం.. ఎంపీగా గెలిచిన వెంటనే కడప స్టీల్ ప్లాంట్ పై చంద్రబాబుతో చర్చించాం.. యుద్ధ ప్రాతిపదికన కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతామని చంద్రబాబు చెప్పారని ఎంపీ సీఎం రమేష్ చెప్పుకొచ్చారు.

## తిరుమల కొండపై విరిగిపడిన చెట్టు కొమ్మ.. తీవ్రంగా గాయపడిన యువతి

**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ):** తిరుమలలో దేవుడి దర్శనానికి వెళ్లిన యువతి గాయాల పాలయ్యింది. తిరుమల కొండపై ఉన్న జాపాలి క్షేత్రంలో ఆంజనేయ స్వామి దర్శనం కోసం ఓ యువతి వెళ్తున్నది. ఈ క్రమంలో ఆమెపై ఒక్కసారిగా చెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో ఆమె కుప్పకూలిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను హుటాహుటిన ఆమెను దవాఖానకు తరలించారు. తల, వెన్నెముకకు తీవ్రగాయాలయ్యాయని వైద్యులు తెలిపారు. బాధితురాలి వివరాలు తెలియాల్సి ఉన్నది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది.



**తిరుమలలో ప్రాంక్ వీడియోలు.. భక్తులపై అకతాయిల వెర్రిచేష్టలు**

తిరుమలలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అకతాయిలు ప్రాంక్ వీడియో లు తీయడం తీవ్ర కలకలం సృష్టించింది. వైరల్ అవుతున్న వీడియో ప్రకారం.. తమిళనాడుకు చెందిన ముగ్గురు యువకులు తిరుమల లోపల ప్రాంక్ వీడియో కోసం.. నారాయణగిరి షెడ్స్‌లోని క్యూలో వెళ్తూ మరో కంపార్టుమెంట్ తాళాలు తీసే ఉద్యోగిలా కలరింగ్ ఇచ్చారు. భక్తులు ఆ వ్యక్తిని టీటీడీ ఉద్యోగిగా భావించి ఒక్కసారిగా పైకి లేచారు. వెంటనే సదరు యూట్యూబర్ కంపార్ట్‌మెంట్ నుంచి నవ్వుతూ పరుగులు తీశాడు.

ఇదంతా మరో యువకుడు వీడియో తీశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పలువురు నెటిజన్లు టీటీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వీడియోలపై టీటీడీ తీవ్రంగా ఖండించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. తిరుమల ఆలయంలోకి ఫోన్ ఎలా తీసుకెళ్లారు? అనేది తెలియాల్సి ఉంది.

## అప్పులు సృష్టించడంలో చంద్రబాబు నంబర్‌వన్ : పేర్ని నాని

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో సంపద సృష్టించడం దేవుడెరుగు.. అప్పులు సృష్టించడంలో చంద్రబాబు నంబర్‌వన్ అవుతున్నారని వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. సంపద సృష్టించి అమరావతిని అభివృద్ధి చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధిపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని వెల్లడించారు. వైసీపీ పార్టీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.



గత వైసీపీ ప్రభుత్వంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసత్యాలతో శ్వేతపత్రం విడుదల చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసత్యాలు, తప్పుడు అంకెలతో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రజలను మోసం చేస్తున్నది చంద్రబాబేనని, బాబు అనాలోచిత నిర్ణయం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని ఆరోపించారు. 2014–19 వరకు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ వల్ల పోలవరానికి తీరని నష్టం జరిగిందని విమర్శించారు.

వైఎస్ జగన్ హయాంలో డయాఫ్రం వాల్, స్పిల్‌వే కట్టామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పిల్లాడికి రూ. 15 వేలు ఇస్తామన్న వాగ్దానం ఏమైందని నిలదీశారు. తల్లికి వందనం.. పిల్లలకు మాత్రం పంగనామాలు పెడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు ఒకమాట, వచ్చిన తరువాత మరో మాట మాట్లాడడం చంద్రబాబుకు అలవాటని విమర్శించారు. ఉచిత ఇసుక అంటూనే డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

## అబద్ధాలు, అసత్యాలకు వైఎస్సార్‌సీపీ పార్టీ బ్రాండ్ అంబాసిడర్

**పశ్చిమ గోదావరి, యలమంచిలి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అబద్ధాలు, అసత్యాలకు వైఎస్సార్‌సీపీ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. యలమంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ... మొన్న విశాఖ ఉక్కు ప్రైవేటు పరమవుతుందన్నారని, నిన్న ఉచిత ఇసుక అమలు కాదన్నారని... ఇవి అబద్ధమని తేలిపోవడంతో వారికి ఏం చేయాలో తెలియడం లేదని ఆక్షేపించారు. నేడు తల్లికి వందనం లేదు అంటూ మరొక అబద్ధం, అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.



30 రోజుల పాలనలో అన్న మాట ప్రకారం పెన్షన్ సొమ్ము పెంపు, డీఎస్సీ, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్లు హామీలను నెరవేర్చామని ఉద్ఘాటించారు. చదువుకునే అందరి పిల్లలకు అమ్మ ఒడి ఇస్తానని జగన్ రెడ్డి చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. అందరికీ తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చారు. రూ. 15వేలు అమ్మఒడిని రూ. 14వేలు, 13వేలుకి కోతతో పాటు ఒక ఏడాది పూర్తిగా ఎగ్గొట్టిన వైసీపీకి మాట్లాడే అర్హత లేదని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## ‘తల్లికి వందనం’ పథకంపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ‘తల్లికి వందనం’ పథకంపై పాఠశాల విద్యాశాఖ కీలక ప్రకటన చేసింది. ఆ పథకం మార్గదర్శకాలను ఇంకా ఖరారు చేయలేదని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. తల్లికి వందనం పథకం కింద రూ. 15వేలు రావాలంటే ఇవే మార్గదర్శకాలంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కోరింది. ఈ పథకం విధివిధానాలు ప్రభుత్వం రూపొందించిన తర్వాత విడుదల చేస్తామని, అప్పటివరకూ ఎలాంటి అవాస్తవాలు నమ్మవద్దని సూచించింది.

## చాముండి దేవిగా వారాహి అమ్మవారు



**నాగాయలంక, ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మండల కేంద్రమైన నాగాయలంకలో కృష్ణా నదీతీరాన శ్రీ రామపాదక్షేత్రం ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా వారాహి గుప్త నవరాత్రులు మహోత్సవాలలో భాగంగా ఎడవ రోజు శుక్రవారం శ్రీ వారాహి అమ్మవారు చాముండి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ముదునూరి శ్రీనివాస్ శాస్త్రి, అచ్యుత శేఖర శర్మ బ్రహ్మత్వంలో వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ, పుష్పాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ప్రాతఃకాల పూజ తదుపరి చాముండి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామపాదక్షేత్రం ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితర భక్త బృందం పాల్గొని పర్యవేక్షించారు.

## జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు




**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, జగన్ సోదరి వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం ఏపీ రాష్ట్ర పరిస్థితి గందరగోళంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం వెలిబుచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో నెట్టాడని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ఆర్థిక స్థితిని గాడిలో పెట్టడం ప్రస్తుత ముఖ్యమంత్రికి కష్టసాధ్యమైన పనేనని అన్నారు.

‘కానీ, ఆయన (చంద్రబాబు నాయుడు) ఇప్పుడు ముఖ్యమంత్రి. కాబట్టి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాల్సిన బాధ్యత ఆయనపై ఉన్నది. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సాధ్యమైనంత త్వరగా నెరవేర్చాలని మేం చంద్రబాబు నాయుడును కోరుతున్నాం. ఇంకా ఆలస్యమవడాన్ని ఆంధ్రప్రదేశ్ భరించలేదు’ అని షర్మిల వ్యాఖ్యానించారు.

రాష్ట్రం ఇప్పటికే చాలా బాధలు అనుభవించిందని, ఇప్పటి ప్రభుత్వమైనా పరిస్థితిని చక్కదిద్దాలని షర్మిల సూచించారు. గడిచిన 10 సంవత్సరాలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ ఇంతవరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం తాను ఇచ్చిన హామీలతోపాటు రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## ఇక రహదారులకు మోక్షం

(మొదటి పేజీ తరువాయి)అత్యవసర పనులు చేపట్టాలని ఆదేశించారు.

**సాంకేతిక అంశాలపై నిపుణులతో చర్చ**

రోడ్ల మరమ్మతులు, నిర్మాణంలో కొత్త, మెరుగైన సాంకేతికతను వినియోగించే విషయంపై సమీక్షలో చర్చించారు. తిరుపతి ఐఐటి, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ప్రభుత్వ అధికారులు, నిర్మాణ రంగ నిపుణులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో, మన్నిక ఉండేలా రోడ్ల నిర్మాణానికి జరిగిన పరిశోధనల వివరాలను సమీక్షలో సీఎంకు తెలిపారు. సాంప్రదాయ పద్ధతిలో కాకుండా పలు రకాల మెటీరియల్స్ ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపడితే కలిగే ప్రయోజనాలపై చర్చించారు. నేల తీరు, ట్రాఫిక్ రద్దీ, వర్షాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందన్నారు. వర్షాకాలంలో కూడా రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టే సాంకేతికపైనా నిపుణులు సాధ్యాసాధ్యాలను వివరించారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ అధికారులు, నిర్మాణ రంగ నిపుణులు పాల్గొన్నారు.

## ఏపీకి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు.. మంత్రి టి.జి భరత్

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలకు మెరుగైన రాయితీలు ఇవ్వడంతో పాటు పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ముందుంటామన్నారు. వ్యాపారాన్ని సులభతరం చేయడం ( ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ) పై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి పాలసీని తయారుచేస్తామని మంత్రి టి.జి భరత్ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాకనే పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, సీఐఐ సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యే అనిల్ భేటి



**పామర్రు** పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా అనిల్ నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి అదేవిధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి జగన్మోహన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు, జగన్ భవిష్యత్ కార్యాచరణ పై పలు సూచనలు చేయడం జరిగిందని తెలిపారు

# వ్యర్థాలతో సంపద సృష్టిని శాస్త్రీయంగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశం. పంచభూతాలను దేవుళ్లుగా భావిస్తాం. చిన్నపాటి నీటి వనరు కనిపిస్తే గంగా జలంగా భావించి పూజలు చేస్తాం. దురదృష్టవశాత్తు మనమంతా పూజలు, పునస్కారాలకు మాత్రమే పరిమితమయ్యాం తప్ప జల వనరులను పరిశుభ్రంగా ఉంచడంలో విఫలమయ్యాం. భీమవరంలో యనమదుర్రు డ్రైన్ ను డంపింగ్ యార్డుగా మార్చేశారు. వర్షాకాలంలో ఆ వ్యర్థాలు పంట కాలువలో కలిసిపోయి నీరు కలుషితమవుతోంది. ప్లాస్టిక్ కవర్లు రోడ్డు మీద ఇష్టానుసారం పడేయడం వల్ల వాటిని ఆహారం అనుకొని తప్పుగా భావించి పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఒకవైపు గోపూజ, గో రక్షణ అంటూనే వాటి మరణానికి మనం బాధ్యులు అవుతున్నాం.

ముందుగా నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తాం. దానిలో వచ్చిన ఫలితాలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ప్రణాళికలు రూపొందిస్తాం. సర్వీసు అంటే ఎవరూ ముందుకు రారు. చెత్తతో సంపద వస్తుంది అంటేనే ముందుకు వస్తారు. ఈ ప్రాజెక్టును పిఠాపురం నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేయడానికి మేము ఏమీ చేయాలో అన్నీ చేస్తాం. ఎవరైనా ముందుకు వచ్చి సాయం చేస్తామని చెబితే వారి సాయం తీసుకుంటాం.



**అవగాహన కల్పించడం చాలా అవసరం**

ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలంటే రోజుకు రెండుసార్లు చెత్తను సేకరించాలి. అంతకంటే ముందు దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలి. అందుకు మాస్టర్ ట్రైనర్స్ తయారు చేయాలని నిర్ణయించుకున్నాం. వాళ్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇస్తాం. ముందుగా నా పార్టీ ఆఫీస్, క్యాంపు ఆఫీస్, నా నియోజకవర్గంలో నేను మొదలు పెడతాను. తరువాత రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. పంచాయతీల ద్వారా మోటివేషన్ తీసుకొస్తాం. ఇది చాలా కష్టమైనది, ఓపికతో కూడుకున్నది. దీనిని గనుక విజయవంతంగా చేయగలిగితే మాత్రం అద్భుతాలు సృష్టించవచ్చు. దీనిని 250 ఇళ్లు, ఒక సమూహంగానే కాకుండా ఒక కుటుంబం కూడా చేసుకునే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా దీనిని ప్రజల్లోకి తీసుకెళ్తాం. ప్రజలంతా దీనిపై అవగాహన పెంచుకోవాలి. చెత్త ద్వారా వచ్చే సంపదను ఆయా కార్మికులకు కేటాయిస్తాం.

**అన్ని అనర్థాలకు ఒక ఐ.ఏ.ఎస్. కారణం**

పంచాయతీలను గత పాలకులు అనేక కారణాలతో నిర్వీర్యం చేశారు. బ్లీచింగ్ పౌడర్ కూడా డబ్బులు లేని పరిస్థితి తీసుకొచ్చారు. పంచాయతీలు సమూలంగా ప్రక్షాళన జరగాలి. స్వయం సమృద్ధిగా పంచాయతీలు ఎదగేలా ఆలోచనలు చేస్తున్నాం. గ్రామాల్లో రోడ్ల వెంట కొబ్బరి చెట్లు పెంచడం ద్వారా కొంత ఆదాయం సమకూర్చుకునే ఆలోచన చేస్తున్నాం. పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో ఏ సమీక్ష చేసినా అన్ని అనర్థాలకు ఒక ఐఏఎస్ కారణం అని చెబుతున్నారు. ఆయన ఇప్పుడు సర్వీసులో లేరు. ఎవరిని బాధ్యులను చేయాలి? నిధులు ఎలా రికవరీ చేయాలి? కేవలం కేసులు పెట్టి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి అంతే.

గ్రామీణ రోడ్ల కోసం మ్యాచింగ్ గ్రాంట్ కూడా ఇవ్వలేదు గ్రామీణ రోడ్లపై జరిగిన సమీక్షలో కూడా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ రిలీజ్ చేయకపోవడం మూలంగా మన రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల కాలేదు. 30 శాతం నిధులు విడుదల చేసుంటే రోడ్ల నిర్మాణం అద్భుతంగా జరిగేది.

రకరకాల పేర్లు చెప్పి నిధులు దారిమళ్లించారు తప్పితే మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయలేకపోయారు. కొన్ని చోట్ల రోడ్లు వేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. ఇలా అన్ని వ్యవస్థల్లో సవాళ్ళు ఉన్నాయి. ఒక్కొక్కటి సరిచేసుకుంటూ ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నామని” అన్నారు.

# తెలంగాణా వార్తలు

## కేసీఆర్ చేసినవన్నీ తప్పులే



- తెలంగాణ లో కేసీఆర్ పార్టీ ఖేల్ ఖతం
- ఎమ్మెల్యే దానం నాగేందర్

**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** అతి త్వరలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని.. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎల్పీ (బీఆర్ఎస్ లెజిస్లేటివ్) పార్టీ.. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీలో విలీనం అవుతుందని సంచలన కామెంట్స్ చేశారు ఎమ్మెల్యే దానం నాగేందర్. హైదరాబాద్ సిటీలో నేడు జరిగిన షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో కేవలం నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారని.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, పల్లా మాత్రమే ఉంటారని.. మిగతా ఎమ్మెల్యేలు అందరూ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని స్పష్టం చేశారాయన.

**కేసీఆర్ చేసినవన్నీ తప్పులే**

ఇదే సందర్భంలో కేసీఆర్ వ్యవహార శైలినీ తప్పుబట్టారు దానం. కనీసం ఎమ్మెల్యేలకు అపాయింట్ మెంట్ కూడా ఇవ్వరని.. ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండరని.. ఎప్పుడూ ఫాంహౌస్ లోనే ఉంటారంటూ చురకలు అంటించారు దానం. ఒకవేళ అపాయింట్ మెంట్ ఇచ్చినా.. గంటల తరబడి కేసీఆర్ కోసం వెయిట్ చేయాలని.. బీఆర్ఎస్ పార్టీలో స్వేచ్ఛలేదన్నారు దానం.

**కేటీఆర్ అనుచరులు మొత్తం దోచేశారు**

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు.. కేటీఆర్, అతని అనుచరులు వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని.. ఆ వివరాలు అన్నీ బయట పెడతానని వెల్లడించారాయన. ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకే ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామంటూ కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని.. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అధికారంలోకి రాదన్నారు దానం.

జైల్లో ఉన్న కవితను బయటకు తీసుకురాకుండా రాజకీయం చేస్తున్నారని.. కావాలనే కవితను జైల్లోనే ఉంచుతున్నారంటూ కేసీఆర్, కేటీఆర్ తీరును ప్రశ్నించారు దానం. అతి త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ మూతపడుతుందని అది ఎంతో దూరంలో లేదని జోస్యం చెప్పారు దానం.

## ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో పనులకు శ్రీకారం

**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్ 2 పనులను ప్రారంభించేందుకు మెట్రో కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది.. ఇప్పటి వరకు మియాపూర్ నుంచి ఎల్బీ నగర్ వరకు మాత్రమే మెట్రో అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకు దాదాపు 7 కిలోమీటర్ల మేర మెట్రోను పొడిగించేందుకు మెట్రో సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రతి కిలోమీటరుకు ఒక స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంది.

మరోవైపు ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ మీదుగా హైవే విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు ఫ్లైఓవర్ నిర్మాణ పనులను కూడా ప్రారంభించనున్నారు. కాగా.. నగరంలో మెట్రో రెండో దశలో మొత్తం 70 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ఎల్బీ నగర్–హయత్ నగర్ ఎంపికైంది. ఎల్ బీ నగర్ నుంచి చింతల్ కుంట, ఆటో నగర్, వనస్థలిపురం, మహావీర్ నేషనల్ పార్క్, హయత్ నగర్ వరకు అన్ని ప్రాంతాల్లో స్టేషన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే స్టేషన్ పాయింట్ ఎక్కడ ఉంది? స్టేషన్ల పేర్లకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ మార్గంలో మెట్రో సేవలు అందుబాటులోకి వస్తే గంటల్లో ప్రయాణం వేగంగా, సౌకర్యంగా ఉంటుందని నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## చిన్న, సన్నకారు రైతులను ఆదుకుంటాం



**మహబూబ్‌నగర్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం వనపర్తి కలెక్టరేట్‌లో రైతు భరోసా విధివిధానాలపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు రైతు భరోసా వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మంత్రి తుమ్మల మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.

**వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం**

వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎంత అవకాశం ఉంటే అంత ఎక్కువ నిధులు వ్యవసాయరంగానికి కేటాయిస్తామన్నారు. రైతు భరోసా పథకం పేద, సన్నకారు రైతులకు ఆదుకునే విధంగా విధివిధానాలు రూపొందించాలని, ఎక్కడో నాలుగు గోడల మధ్య ఉండి రూపకల్పన చేయకుండా ప్రజాక్షేత్రంలో రైతులు అభిప్రాయాలు సేకరిస్తున్నామని అన్నారు. రైతులు అందరూ నిర్భయంగా తమ అభిప్రాయాలను వెల్లడించాలని సూచించారు.

**అందరి అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చ**

రైతుల అభిప్రాయాలు తీసుకున్నత్వరాత, రాజకీయ నాయకుల అభిప్రాయాలు తీసుకుంటామన తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అందరి అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారు.

**రెచ్చగొట్టే మాటలు తిప్పికొట్టాలి**

రైతులను రెచ్చగొట్టే విధంగా ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని, అలాంటి మాటలను తిప్పికొట్టాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు కూడా మంచి సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. రైతు భరోసాపై ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, లోక్‌సభ సభ్యుడు మల్లు రవి, ఎమ్మెల్యే మేఘా రెడ్డి , కలెక్టర్ , వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో బ్రాహ్మణ పరిషత్ పరిస్థితి అగమ్యగోచరం

- నిధులు విడుదల కాక ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు
- తక్షణం నిధులు విడుదల రిలీజ్ చేయాలంటూ సిఎంకు హరీశ్ లేఖ



**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆగమ్య గోచరంగా మారిందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. "రాష్ట్రంలోని పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి ఆర్థిక మద్దతును అందించాలని సహృదయంతో కేసీఆర్ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ప్రారంభించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిషత్ పరిస్థితి అగమ్యగోచరం కావడం బాధాకరం. విద్య, స్వయం ఉపాధి, వేద విద్యకు ప్రోత్సాహం కోసం అమలు చేసిన వివిధ పథకాలు ఆగిపోవడం విచారకరం. అసలు బ్రాహ్మణ పరిషత్ ఉన్నట్టా? లేనట్టా?" అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు.

**కెసిఆర్ ప్రతి ఏటా రూ. వంద కోట్లు ఇచ్చారు..**

సీఎంగా కేసీఆర్.. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కోసం ఏటా రూ.100కోట్లు క్రమం తప్పకుండా కేటాయించారని లేఖలో పేర్కొన్న హరీశ్‌రావు.. పలు డిమాండ్లను ప్రస్తావించారు. "బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కు గతంలో లాగానే నిధులు విడుదల చేయాలి. వార్షిక బడ్జెట్ లో ఏటా వంద కోట్లు కేటాయించాలి. బ్రాహ్మణ పరిషత్ పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి. విదేశీ విద్య పథకానికి దరఖాస్తు చేసుకొని, ఎంపికైన 300 మంది విద్యార్థులు ఇప్పటికే విదేశాల్లో చదువుతున్నారు. రూ.30 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలి" అని కోరారు.

**ఫండ్స్ విడుదల చేయండి**

బ్రాహ్మణ ఎంటర్ ప్రెన్యూయల్ స్కీం ఆఫ్ తెలంగాణ (బెస్ట్) కింద దరఖాస్తు చేసుకొని, ఎంపికైన 497 మందికి సంబంధించిన రూ.16 కోట్లు విడుదల చేయాలి. 706 మందికి ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తి చేసి, 2023–24 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న 1869 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఎస్సై శ్రీను సూసైడ్ కేసులో .. నలుగురు అధికారులపై వేటు !



**అశ్వారావుపేట ( జర్నలిస్ట్ ఫైల్ ):** అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను సూసైడ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను సూసైడ్ కేసులో ఎట్టకేలకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను సూసైడ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు కానిస్టేబుల్ లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, చనిపోయే ముందు ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఇచ్చిన మరణ వాంగ్మూలం ఇచ్చాడు. ఆంధ్రకు నలుగురు కానిస్టేబుల్స్ సన్యాసి నాయుడు, శేఖర్, సుభాని, శివ నాగరాజు సహా సీఐ వేదింపులతో ఆత్మహత్య చేసుకున్నట్లు శ్రీరాముల శ్రీనివాస్ చెప్పాడు. దానికి తగ్గట్టుగానే.. అధికారులు చర్యలు తీసుకున్నారు.

## 16న కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ



**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఈనెల 16న కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అవనున్నారు. సెక్రటేరియట్‌లో ఈ సమావేశం జరుగనుంది. 16న ఉదయం నుంచి సాయంత్రం వరకు జరగనున్న సమావేశంలో ప్రధానంగా తొమ్మిది అంశాలపై ముఖ్యమంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. బదిలీల ప్రక్రియ, ఉన్నతాధికారుల బదిలీలు పూర్తయిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగనుంది.

**ఎజెండా అంశాలు ఇవే..** ప్రజా పాలన, ధరణిజి, వ్యవసాయం, వైద్య – ఆరోగ్యం, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్యజి, శాంతి భద్రతలు, డ్రగ్స్ నిర్మూలన.

## తెలంగాణ ప్రజల ఏకైక గ్యారంటీ నరేంద్ర మోదీ



- కేంద్ర మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఈ చేరికలకు సంబంధించి కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వయంగా కేసీఆర్ .. సొంత ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల ఏకైక గ్యారంటీ నరేంద్ర మోదీ అని తెలిపారు. అవినీతి నుంచి బయట పడేందుకు కాంగ్రెస్‌కు కేసీఆర్ సహకరిస్తున్నారని ఆరోపించారు.

సెక్యూరిటీ లేకుండా.. రాహుల్ గాంధీ ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని సవాల్ విసిరారు. నిరుద్యోగులను పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేస్తోందని కేంద్ర మంత్రి మండిపడ్డారు. రాహుల్ గాంధీని సొంత పార్టీ వారే ప్రధాని అభ్యర్థిగా అంగీకరించలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలకు పెద్ద పీట వేస్తుందన్నారు. బీజేపీ కార్యకర్తల గెలుపే రాష్ట్ర బీజేపీ నాయకత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీతో తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు వ్యతిరేకించారనటానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులు కూడా నరేంద్ర మోదీ మాత్రమే గ్యారంటీ అంటున్నారన్నారు. ధర్మం, తెలంగాణ పేదల కోసం పోరాడేది బీజేపీ మాత్రమే అని చెప్పుకొచ్చారు. బీజేపీ కార్యకర్తల పోరాటం వలనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8సీట్లు వచ్చాయన్నారు. రైతులను మోసం చేసే విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందన్నారు.

## తెలంగాణలో కోల్ మైనింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ !

- డిప్యూటీ సీఎం భట్టితో ఐఐటీ హైదరాబాద్, మోనాష్ వర్సిటీ ప్రొఫెసర్ల భేటీ

**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** బ్యాటరీల్లో వాడే అరుదైన ఖనిజ నిక్షేపాలకు సంబంధించి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ్ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్' కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు తనని కలిసిన ఐఐటీ హైదరాబాద్, ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ విశ్వవిద్యాలయ బృందానికి భట్టి భరోసా ఇచ్చారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు మూర్తి నర్సింహ, ఆశోక్ కామరాజ్, మోనాష్ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎలిశెట్టి మోహన్ ఉపముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బ్యాటరీల్లో ఉపయోగించే అరుదైన ఖనిజాలను ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, వాటిని సొంతంగా తయారు చేసుకుంటే దేశానికి లాభమని మంత్రికి వివరించారు.

## కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు... ఆప్, బీజేపీల మధ్య మాటల యుద్ధం



**ఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఆప్ కన్వీనర్, సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు, బీజేపీ నేతలకు మధ్య మాటల యుద్ధం మొదలైంది. మద్యం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడం ద్వారా బీజేపీ కుట్రను బట్టబయలు చేసినట్లు అయిందని ఆప్ నేతలు స్పష్టం చేశారు. అయితే బీజేపీ నేతలు మాత్రం ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆప్ స్వాగతించింది. ఆ క్రమంలో సత్యమేవ జయతే అంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే త్రివర్ణ పతాకాన్ని పట్టుకున్న సీఎం కేజ్రీవాల్ ఫొటోను సైతం దానికి జత చేసింది. దీనిపై ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచిదేవ స్పందించారు. సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మాత్రమే వచ్చిందన్నారు. అంతేకానీ ఆయన నిర్దోషిగా విడుదల కాలేదని ఆప్ నేతలకు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కీలక సూత్రధారి అరవింద్ కేజ్రీవాలేనని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజలను దోచుకున్నారంటూ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై వీరేంద్ర నిప్పులు చెరిగారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ, ఈ అవినీతి కేసులో ఆయన్ని సీబీఐ అరెస్ట్ చేసిందని.. అందుకే ఆయన జైలులోనే ఉన్నారని ఈ సందర్భంగా ఆప్ నేతలకు వీరేంద్ర గుర్తు చేశారు.

## బిభవ్ కుమార్ బెయిల్ తిరస్కరణ



**ఢిల్లీ :** ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మలివాల్ దాడి కేసులో బిభవ్ కుమార్‌కి బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తిరస్కరించింది. అతనికి బెయిల్ ఇచ్చేందుకు ఎలాంటి కారణం లేదని జస్టిస్ అనూప్ కుమార్ మెండిరట్ట బిభవ్ కుమార్ బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, దర్యాప్తు పూర్తయినందున తన కస్టడీని పొడిగింపు అవసరం లేదని పేర్కొంటూ బెయిల్ జారీ చేయాల్సిందిగా బిభవ్ కుమార్ పిటిషన్‌లో తెలిపారు.

మే13న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో బిభవ్ కుమార్ స్వాతిమలివాల్‌పై దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. స్వాతి మలివాల్ ఫిర్యాదు మేరకు మే 18న పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు

## మనోరమా కేడ్కర్ తుపాకీతో హల్‌చల్.. వీడియో వైరల్



**పుణె:** పుణె ట్రైనీ ఐఏఎస్ పూజా కేడ్కర్ అధికార దుర్వినియోగం నేపథ్యంలో ఆమెపై మహారాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆమె తల్లి మనోరమా కేడ్కర్ రైతులను తుపాకీతో బెదిరిస్తున్న ఓ వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరలవుతోంది. పుణెలోని ముల్షీ తాశీల్‌లో 25 ఎకరాల భూమిని కేడ్కర్ కుటుంబం కొనుగోలు చేసింది. ఆ క్రమంలో పక్కనున్న రైతుల భూమి సైతం ఆ భూమిలో కలిసింది. దీంతో ఆ భూమి యజమాని అయిన రైతు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో బౌన్సర్‌ని వెంటపెట్టుకుని మనోరమా కేడ్కర్.. వ్యవసాయ భూమి వద్దకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా తుపాకీ చూపిస్తూ రైతును ఆమె బెదిరించింది. అయితే ఈ వ్యవహారం కోర్టులో ఉందని మనోరమకు రైతు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ భూమి నిజమైన యజమానివి నివేనా? కానీ ఈ స్థలం తన పేరు మీద ఉందని అతడికి స్పష్టం చేసింది. అయినా ఈ వ్యవహారం కోర్టులో ఉంటే ఏమిటి? నేను ఎవరికీ భయపడనంటూ అతడికి సమాధానం ఇచ్చింది. దీంతో కోర్టు నిర్ణయం ఇప్పడప్పుడే రాదని రైతు పేర్కొనగా.. అయితే ఈ భూమికి అసలు యజమానిని నేనేనంటూ మనోరమ పేర్కొంది. ఈ ఘటన గతేడాది అంటే.. 2023లో జరిగిందని సమాచారం. నాటి వీడియో.. నేడు వైరల్ అవుతుంది. ఇక కేడ్కర్ ఫ్యామిలీకి మహారాష్ట్రలో భారీగా ఆస్తులున్నట్లు ఓ ప్రచారం సైతం సాగుతుంది.

మరోవైపు అధికార దుర్వినియోగానికి పాల్పడిన పుణె ట్రైనీ కలెక్టర్ పూజా కేడ్కర్‌ను వాషిమ్‌కు బదిలీ చేసింది. ఆమె తండ్రి దిలీప్ కేడ్కర్ సైతం రిటైర్డ్ సివిల్ సర్వెంట్ అధికారి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా ఆయన పోటీ చేశారు. తన ఆస్తి రూ. 40 కోట్లు ఉందంటూ తన ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. అయితే పూజా కేడ్కర్ ఓబీసీ రిజర్వేషన్‌తోపాటు అంధత్వం, మానసికి వైకల్యం కోటాలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అదీకాక పుణె ట్రైనీ కలెకర్ట్ పూజా కేడ్కర్ గొంతెమ్మ కోర్కెలు కోరడం.. వాటిని అమలు చేయాలంటూ పుణె జిల్లా కలెక్టర్‌పై ఆమె తండ్రి దిలీప్ కేడ్కర్ ఒత్తిడి తీసుకురావడం జరిగేది.

ఇక పూజా కేడర్క్ అధికార దుర్వినియోగం ఒక్కసారిగా వెలుగులోకి రావడంతో.. ఆ కుటుంబంలోని వ్యక్తుల ఆగడాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తొలుత పూజా కేడ్కర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అనంతరం ఆమె తండ్రి దిలీప్ కేడ్కర్ వ్యవహారం బయటకు వచ్చింది. తాజాగా ఆమె తల్లి మనోరమా సైతం రైతుకు తుపాకీతో బెదిరిస్తున్న వీడియో అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇంకోవైపు ట్రైనీ ఐఏఎస్ పూజా కేడ్కర్‌పై ఆరోపణలు వెల్లువెత్తడంతో.. కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఆమె వ్యవహారంపై విచారణ జరిపేందుకు ఏక సభ్య కమిటిని నియమించింది. ఈ అంశంపై రెండు వారాల్లో నివేదిక అందజేయాలని సదరు కమిటీని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.

## స్మృతి ఇరానీ పట్ల అవమానకరమైన పదాలు ఉపయోగించవద్దు

- కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ గాంధీ సూచన



**ఢిల్లీ :** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హుందాతనాన్ని ప్రదర్శించారు. తన పట్ల తీవ్ర విమర్శలు గుప్పించే బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ స్మృతి ఇరానీ పట్ల అవమానకరమైన పదాలు ఉపయోగించవద్దంటూ కాంగ్రెస్ శ్రేణులను కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "రాజకీయ జీవితంలో గెలుపు, ఓటములు సహజం. ఆమె పట్ల అవమానకరమైన భాష, అసభ్యకరమైన పదాలు ఉపయోగించడాన్ని మానుకోవాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను. వ్యక్తులను అవమానపరచడం, అభాసుపాలు చేయడం బలహీనతకు సంకేతం. బలం కాదని తెలుసుకోవాలి" అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ స్పందించిన తీరుపై రాజకీయ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. హుందాతనాన్ని చూపించారని వ్యాఖ్యానిస్తున్నారు.

అమేథీ నియోజకవర్గ అభివృద్ధిని రాహుల్ గాంధీ పట్టించుకోరంటూ స్మృతి ఇరానీ ఎన్నోసార్లు విమర్శించారు. రాహుల్‌ని హేళన చేస్తూ మాట్లాడిన పలు సందర్భాలు కూడా ఉన్నాయి. గాంధీ కుటుంబం, ముఖ్యంగా రాహుల్ గాంధీ అమేథీ ప్రజలు పేదలుగా ఉండాలని కోరుకుంటున్నారని ఆరోపణలు కూడా చేశారు.

2019 సార్వత్రిక ఎన్నికల్లో అమేథీ నియోజకవర్గం నుంచి రాహుల్ గాంధీని స్మృతి ఇరానీ ఓడించారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఫలితం రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ అభ్యర్థి, గాంధీ కుటుంబానికి సన్నిహితుడిగా పేరున్న కిషోరీ లాల్ శర్మ చేతిలో స్మృతి ఇరానీ ఏకంగా 1,67,196 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మరోవైపు రాహుల్ గాంధీ 2024 ఎన్నికల్లో వయనాడ్, రాయ్ బరేలీ నియోజకవర్గాల నుంచి బంపర్ మెజారిటీతో గెలిచిన విషయం తెలిసిందే. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ చేతిలో ఇరానీ ఓడిపోయారు.

# జాతీయ వార్తలు

## నేను సీఎం కావడం బీజేపీ నేతలకు ఇష్టంలేదు



- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

**బెంగళూరు:** మైసూరు నగరాభివృద్ధి సంస్థ ముడా అధ్వానంగా మారిందని దారిలోకి తీసుకువస్తానని సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. శుక్రవారం మైసూరులోని నివాసం వద్ద ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇదే సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'ముడా' అవినీతిపై ఇద్దరు ఐఏఎస్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. సమగ్ర నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ పాలనలోనే కాకుండా తమ ప్రభుత్వంలోనూ తప్పులు జరిగాయని వాటిని సరిచేస్తానన్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు తాను రెండోసారి ముఖ్యమంత్రి కావడమే ఇష్టం లేదన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. చట్టపరంగా విచారణ సాగుతున్న వివాదంపైనా రోజూ పనిగట్టుకుని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన భార్య పార్వతి పేరిట ఇంటి స్థలం కేటాయించడం అక్రమమే కాదన్నారు. బీజేపీ వ్యవధిలోనే తన భార్యకు ఇంటి స్థలం మంజూరు చేశారన్నారు. స్థలం వచ్చినప్పుడు తాను ప్రతిపక్ష నేతగా ఉన్నానన్నారు. ముడా తప్పు చేసి ఆతర్వాత పరిహారంగా స్థలం ఇచ్చిందన్నారు. భూమి కోల్పోయిన మేం స్థలం పొందడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. తమకు ఇచ్చిన స్థలం వారే వాపసు తీసుకుని వడ్డీతో కలిపి రూ.62 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాను రెండోసారి సీఎం కావడాన్ని జీర్ణించుకోలేని కొందరు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు.

## 16 రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సమన్లు

**ఢిల్లీ:** 'రెండో నేషనల్ జ్యుడిషియల్ పే కమిషన్' (ఎస్ఎన్‌జేపీసీ) సిఫార్సులను అమలు చేయని 16 రాష్ట్రాలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ఆర్థికశాఖ కార్యద ర్శులు ఆగస్టు 23న స్వయంగా కోర్టుకు హాజరుకావాలని సమన్లు ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కేసుపై తదుపరి విచారణ చేపట్టింది. కోర్టు సహాయకునిగా (అమికస్ క్యూరీ) వ్యవహరిస్తున్న న్యాయవాది కె.పరమేశ్వర్ ఇచ్చిన నివేదికను ధర్మాసనం పరిగణనలో తీసుకుంది.

ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళ, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు సర్వోన్నత న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. పదవీవిరమణ పొందిన జ్యుడిషియల్ అధికారులకు పే కమిషన్ సిఫార్సుల మేరకు పింఛను బకాయిలు, ఇతర ప్రయోజనాలు కల్పించడంలో ఈ రాష్ట్రాల అలసత్వం, వివిధ భత్యాలపై మూలం వద్ద పన్ను మినహాయింపుపై అసహనం వ్యక్తంచేసింది. ఎలా చేయించాలో మాకు తెలుసు 'ఈ పనిని ఇప్పుడెలా చేయించాలో మాకు తెలుసు. ప్రమాణపత్రం దాఖలు చేయకపోతే ప్రధాన కార్యదర్శి హాజరుకావాలని మేం చెప్పినంత మాత్రాన అది దాఖలు కాదు. మేం వారిని జైలుకు పంపడం లేదు. వారు ఇక్కడకు వస్తే ప్రమాణపత్రం కూడా వస్తుంది. ఏడు అవకాశాలిచ్చినా పూర్తిస్థాయిలో అమలు చేయడంలో అనేక రాష్ట్రాలు విఫలమయ్యాయి. ప్రధాన కార్యదర్శులు, ఆర్థిక కార్యదర్శులు వ్యక్తిగతంగా రాకపోతే ధిక్కరణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది' అని సీజేఐ ధర్మాసనం హెచ్చరించింది.

# ప్రతి రైతు ఆత్మగౌరవంతో బతికేలా పనిచేస్తా

- **మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అచ్చెన్నాయుడు**
- **సచివాలయంలోని తన ఛాంబర్ లో బాధ్యతల స్వీకరణ**
- **ఆరు ఫైళ్లపై సంతకాలు చేసిన మంత్రి అచ్చెన్నాయుడు**


**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది.. ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు.. మంత్రులు కూడా బాధ్యతలు స్వీకరించారు.. ఇక, ఛాంబర్లలో మార్పులు, చేర్పులతో.. కొందరు మంత్రుల బాధ్యతల స్వీకరణ ఆలస్యం అయ్యింది. శుక్రవారం మంత్రి అచ్చెన్నాయుడు తన ఛాంబర్లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సచివాలయంలోని తన ఛాంబర్ సిద్ధం కాకపోవడంతో ఆలస్యంగా బాధ్యతలు స్వీకరించారు అచ్చెన్నాయుడు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నను టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు, అభిమానులు అభినందలు తెలిపారు.

మరోవైపు.. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆరు ఫైళ్లపై సంతకాలు చేశారు మంత్రి అచ్చెన్నాయుడు.. పొలం పిలుస్తుంది కార్యక్రమంపై తొలి సంతకం చేసిన ఆయన.. వ్యవసాయ యాంత్రీకరణపై రెండో సంతకం.. 217 జీవో రద్దు చేస్తూ మరో సంతకం.. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ నిధుల విడుదలపై ఇంకో సంతకం.. పశువుల డీవార్మింగ్, యానిమల్ సెన్సెస్ పై ఇలా ఆరు సంతకాలు చేశారు.



ఇక, ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా వ్యవసాయ శాఖకు తాళం వేశారు.. కానీ, కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి ఉండదు.. రైతు ఆత్మగౌరవంతో బతికేలా పనిచేస్తాం అన్నారు. కౌలు రైతులను ఆదుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు.. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రతి రైతు ఆత్మగౌరవంతో బతకాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రభుత్వం దృష్టికి తేవాలని.. వాటి పరిష్కారానికి కృషి చేస్తాం అన్నారు.. ఈనెల 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రారంభిస్తామని పేర్కొన్నారు.. ప్రతి మంగళవారం, బుధవారం వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి అన్ని విషయాలు వివరించి అవగాహన కల్పిస్తారని వివరించారు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

## నంద్యాలలో మైనర్ బాలికపై అత్యాచారం నిందితులను వదిలే ప్రసక్తే లేదు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎల్లాల గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికను ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసిన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. మైనర్ బాలిక హత్యాచార ఘటన నిందితులను వదిలే ప్రసక్తి లేదని వెల్లడించారు. ఆడబిడ్డల తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.
నేరాలను రాష్ట్ర ప్రభుత్వం సహించదని అన్నారు. ఆడబిడ్డల రక్షణకు సంస్థాగత మెకానిజం కావాలని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు పిల్లలను నిశితంగా పరిశీలించాలని అన్నారు. ఆదివారం గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక అదృశ్యమైంది.
తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించగా దీంతో వారు బాలికను అత్యాచారం, హత్య చేసి హంద్రీనీవా సుజల ప్రవంతి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో పడవేసామని అంగీకరించారు. అప్పటి నుంచి పోలీసులు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వరకు కూడా బాలిక ఆచూకి లభించలేదు.

## రైల్వే సమస్యలను పరిష్కరించండి



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రైల్వే సమస్యలు పరిష్కారం కోరుతూ ఈరోజు హైదరాబాదులోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ను టిడిపి పార్లమెంటరీ నేత, నరసరావు పేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విన్నవించారు. పలు సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని జిఎం కు ఎంపీ అందజేశారు.
పల్నాడు ప్రజలకు మేలు కలిగేలా.. ప్రస్తుతం సికింద్రాబాద్ నుండి తిరుపతి వరకు ఉన్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కు పిడుగురాళ్ల స్టేషన్లో స్టాపేజ్ ఇవ్వాలని కోరారు. అలాగే విజయవాడ నుండి బెంగుళూరు వరకు.. నరసరావుపేట, వినుకొండలో స్టాప్‌లతో కొత్త వందేభారత్ రైలుని ప్రారంభించాలని కోరారు. పెదకూరపాడు స్టేషన్ లో పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజ్‌ని ఇవ్వాలని, సత్తెనపల్లి స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ కు స్టాపేజీ ఇవ్వాలని, విశాఖపట్నం నుండి గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేసారు. పేరుచెర్ల నుండి గన్నవరం లేదా పెదవుటపల్లికి కొత్త ఎమ్ఎమ్ టిఎస్ రైలు సేవలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పల్నాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ విజయవంతంగా 25 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకుందని, ప్రస్తుతం ఉన్న బోగీలను వందే భారత్ రైళ్ల ప్రమాణాలతో కొత్త బోగీలకు మార్చాలని కోరారు. కొత్త జిల్లా పల్నాడులో ఆర్ ఓబీలు, ఆర్యుబిలు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని, కొత్తవి మంజూరు చేయాలని కోరారు.
పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల, నడికుడి రైల్వే స్టేషన్లను ప్రతిష్టాత్మకమైన అమృత్ భారత్ స్టేషన్ పథకం ఆధునికీకరణ చేపట్టాలని కోరారు. రైల్వే లైన్ పనులని పూర్తి చెయాలనీ కోరారు.

## బాయిలర్ పేలిన ఘటనలో మరొకరు మృతి.. మూడుకు చేరిన మృతుల సంఖ్య



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్టీఆర్ జిల్లా బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో బాయిలర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడ్డవారిలో మరొకరు శుక్రవారం మృతి చెందారు. ఈనెల 7న జరిగిన ఘటనలో మొత్తం 20 మంది కార్మికులు గాయపడగా వీరిలో 5 గురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా వీరిలో చికిత్స పొందుతూ ఇప్పటికే ఇద్దరు కార్మికులు చనిపోగా మణిపూర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ అర్జున్ అనే కార్మికుడు శుక్రవారం మృతి చెందారు.
దీంతో ఘటనలో చనిపోయిన వారి సంఖ్య మూడుకు చేరుకుంది. ఘటనపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం క్షతగాత్రులకు యాజమాన్యం తగిన నష్టపరిహారం అందించాలని ఆదేశించింది . గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని స్పష్టం చేసింది .

## సమాచార శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లా

- **2013 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లా**
- **హిమాన్షు శుక్లాకు ఘన స్వాగతం పలికిన ఐ అండ్ పీఆర్ అధికారులు**
- **పుష్పగుచ్ఛాలతో అభినందలు తెలిపిన ఉద్యోగులు, సిబ్బంది**
- **గతంలో డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు**
- **సమర్ధవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్న హిమాన్షు శుక్లా**
- **సంక్షోభాలను సవాళ్లుగా తీసుకుని, సమస్యకు పరిష్కారం చూపించడంలో తనదైన ముద్ర వేసిన హిమాన్షు శుక్లా**



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ గా 2013 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ లోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండవ అంతస్తులోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 3 గం.లకు ఆయన డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం హిమాన్షు శుక్లా ఐ అండ్ పీఆర్ అధికారులతో సమావేశమై శాఖాపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమాచార, పౌర సంబంధాల శాఖకు డైరెక్టర్ గా రావడం ఆనందంగా ఉందన్నారు.
అంతకుముందు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హిమాన్షు శుక్లాకు ఘనస్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్లు పి. కిరణ్ కుమార్, తేళ్ల కస్తూరి, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ . ఓ.మధుసూధన, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్లు . సి.వి. కృష్ణారెడ్డి, నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్లు . ఎం.భాస్కర్ నారాయణ,. జీవీ. ప్రసాద్, వెంకటరాజు గౌడ్, ఎఫ్ డీసీ జనరల్ మేనేజర్ . శేష సాయి, ఐ అండ్ పీఆర్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ అర్ధరాత్రి తనిఖీలు



- **ఏకదాటిగా మూడు గంటల పాటు పరిశీలన**
- **అర్ధరాత్రి నుంచి కనపడని సిబ్బంది**
- **అత్యవసర చికిత్స విభాగం లో ప్రైవేట్ ల్యాబ్ టెక్నిషియన్ దందా**
- **పోలీసులకు అప్పగింత**

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ )** రోగులు.. వారి సహాయకులు ఫిర్యాదుల మేరకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో గురువారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ లు నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆసుపత్రి లో అత్యవసర చికిత్స విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో డోల్ల తనం కనిపించిన చోట వైద్యులకు వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్యాజువాలిటీ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద ఒకరు మాత్రమె గుత్తే దారుని ఉద్యోగి పని చేస్తున్నారని చెప్పారు. రోగుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మరొకరిని నియమించాలని ఆదేశించిన గుత్తెదారుడు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. అర్ధరాత్రి తనకు ఫోన్ చేసి సిబ్బంది పని చేయడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారని ఆయన చెప్పారు. ఇప్పటికైనా గమనించి మరొకరిని సిబ్బంది ని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.
గత ఆరు ఏడు నెలల నుంచి ఈ సి జి టెక్నిషియాన్ రాత్రి పూట ఒకరు మాత్రమే పని చేస్తున్నారని మరొకరు అర్ధరాత్రి నుంచి విధులకు డుమ్మా కొడుతున్నట్లు పరిశీలన లో వెల్లడైయిందని ఆయన అన్నారు. ఈ సి జి రీల్స్ లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రతిరోజూ ఈ సి జి రోల్స్ ఎవరూ ఇస్తున్నారు.. ఇండెంట్ ఎవరు ఇస్తున్నారు..ఎవరీ ద్వారా తీసుకుంటున్నారు అనే అంశాలపై విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశించినట్లు ఆయన చెప్పారు. ఈ సి జి రోల్స్ బయటకు తీసుకుని వెళ్లి దందా చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై వెంటనె విచారణకు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.డి ఏ పి వైద్యుడు లేకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు సేవలు ఎవరు ఇస్తారు.. పీజీ లపై వదిలి తే రోగుల పరిస్థితి ఏమిటని గంట తర్వాత వచ్చిన డి ఏ పి వైద్యుడ్ని ఆయన ప్రశ్నించారు. అత్యవసర చికిత్స విభాగం లో అనధికారికంగా తిరుగుతున్న ల్యాబ్ టెక్నిషియాన్ ను గమనించినట్లు ఆయన చెప్పారు. అమాయక రోగుల వద్ద ల్యాబ్ పరీక్షల పేరిట ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని రోగుల సహాయకులు ఫిర్యాదు చేసారని ఆయన తెలిపారు. ల్యాబ్ టెక్నిషియాన్ వద్ద వ్యక్యూ టైనర్స్ ఉండటంతో వెంటనే గమనించి ఔట్ పోస్ట్ పోలీసులకు అప్పగించినట్లు ఆయన చెప్పారు.
ట్రయిల్ రన్ లో ఉన్న సిటీ స్కాన్ మిషన్ ను ఆయన పరిశీలించారు. సర్వీస్ ఇంజనీర్ తో మాట్లాడి వెంటనే రోగులకు అందుబాటులో ఉంచాలన్నారు. కేంద్ర గ్రామీణ భివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ఆసుపత్రి ని తనిఖీ చేస్తారని మిషన్ ను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.
ఆధునిక కేర్ యూనిట్ ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డికి భారీ షాక్.. వైసీపీని వీడిన ప్రధాన అనుచరవర్గం



**చిత్తూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వరుస షాకులు తగులుతున్నాయి. ఆయన సొంత ఇలాకాలో వైసీపీ నేతలు వరసగా పార్టీని వీడుతున్నారు. ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి భారీ విజయాన్ని సొంతం చేసుకొని అధికారంలోకి వచ్చింది. గతంలో వైసీపీ ఘోర పరాజయం పాలవ్వడంతో వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గం అయిన పుంగనూరులో పార్టీ నేతలు ఆయనకు షాక్ ఇస్తున్నారు. ఇవ్వాళ పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు పులిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ పార్టీని వీడారు. అంతేగాక జెడ్పీటీసీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. అలాగే ఆయన బాటలోనే పులిచర్ల మండల వైసీపీ ఎంపీపీలు రాశిప్రసాద్, ఈశ్వరీ గోవర్ధన్ లతో పాటు నలుగురు ఎంపీపీలు, ఏడుగురు సర్పంచులు కూడా తమ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ నాయకుల అండ లేకపోవడంతోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు నేతలు ప్రకటించారు. అయితే వీరితో పాటు మరికొందరు కూడా రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, వీరంతా త్వరలోనే టీడీపీలోకి లేదా బీజేపీలోకి జాయిన్ అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.
కాగా గతంలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాను ఏకచత్రాధిపత్యంగా ఏలారు. ఇప్పుడు సొంత అనుచరులే పార్టీని వీడి పెద్దిరెడ్డికి దిమ్మతిరిగే షాకులు ఇస్తున్నారు. ఇప్పటికే పుంగనూరు మున్సిపల్ చైర్మన్ సహా.. 12 కౌన్సిలర్లు పార్టీకి గుడ్ బై చెప్పగా.. ఇప్పుడు ఆయన ప్రధాన అనుచరుడుగా పేరున్న మురళీధర్ కూడా ఆయన్ను వదిలేసి వెళ్లడం పార్టీ నేతలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇదిలా ఉండగా వైసీపీ పాలనలో పేరుకే పదవులు పెత్తనం మాత్రం పెద్దిరెడ్డిదే అని వారు ఆరోపిస్తుండటం గమనార్హం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎర్రచందనం, భూకబ్జాలు, ఇసుక అక్రమ రవాణా వంటివి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పెద్దిరెడ్డికి పార్టీ నుంచి ఒక్కొక్కరుగా జారుకోవడం సమస్యగా మారింది. గత ప్రభుత్వంలో మంత్రిగా చేసిన వైసీపీ నేతలు అందరూ ఓటమి బాట పట్టగా ఒక్క పెద్దారెడ్డి మాత్రమే అంతంత మాత్రం మెజారిటీతో గెలిచారు. ఇప్పుడు ఉన్న పార్టీ నేతలు కూడా చేజారుతుండటంతో పుంగనూరులో వైసీపీ ఖాళీ అవుతుందనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక టీడీపీ ప్రభుత్వం గత పాలనలోని అక్రమాలను బయటకి తీసి చర్యలు తీసుకునే సమయానికి పార్టీలో ఒంటరిగా మిగిలిపోతాడనే గుబులులో పెద్దిరెడ్డి ఉన్నట్లు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

## విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్రిక్తత

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు. నిన్న ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నం చేసుకోవడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే చికిత్స చేస్తున్న క్రమంలో వ్యక్తి చనిపోయారు. అయితే వ్యక్తి మృతికి వైద్యం ఆలస్యం చేయడమే కారణమంటూ బంధువులు ఆందోళనకు దిగారు. ఓ జూనియర్ డాక్టర్ల పై దాడి చేశారు. దీంతో ఈ దాడికి నిరసనగా జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. తమకు భద్రత కల్పించాలంటూ నినాదాలు చేశారు. సమ్మెకు నోటీస్ ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు. అయితే సమ్మె నోటీస్ ను తీసుకునేందుకు సూపరింటెండెంట్ నిరాకరించారు. రంగంలోకి దిగిన పోలీసులు జూనియర్ డాక్టర్లకు సర్ది చెప్పారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో జూనియర్ డాక్టర్లు ఆందోళనను విరమించారు.




జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా.. సకాలంలో పేపరు అందడం లేదా.. సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు... సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467